క్లుప్తంగా

గుప్త నిధుల కోసం తవ్వకాలు



బెల్లంకొండ: మండలంలోని ఎమ్మాజీగూడెం లో రెండు రోజుల క్రితం గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపిన వివరాలు.. గ్రామంలో పులిచింతల బాక్ వాటర్ నిల్వ ఉన్న ప్రాంతంలో... బండారు ఆంజనేయులు పొలంలో తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. పొలంలో ఆంజనేయ స్వామి విగ్రహం ఉండడంతో విగ్రహ సమీపంలో క్షుద్ర పూజలు నిర్వహించారు. అదే విధంగా విగ్రహం సమీపంలో పొక్లెయిన్‌తో దాదాపుగా ఆరు అడుగుల వరకూ తవ్వి గుప్త నిధుల కోసం గుంతను తవ్వారు. తవ్వకాలపై పొలం యజమాని నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదు. పొలం యజమాని ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

క్రోసూరు తహసీల్దార్‌గా జియావుల్‌హక్



క్రోసూరు: తహసీల్దార్‌గా ఎండీ జియావుల్ హక్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన డి.శ్రీనివాసరావు అనారోగ్య కారణంతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లటంతో ఆయన స్థానంలో తహసీల్దార్‌గా వచ్చారు. పెదకూరపాడు ఎన్నికల డ్యూటీ అధికారి పనిచేస్తూ క్రోసూరు తహసీల్దార్‌గా వచ్చినట్లు హక్ తెలిపారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలు ప్రజలకు చేరువయ్యేలా, ముఖ్యంగా రైతుల, భూముల , సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

నవోదయకు ఎంపికైన సెయింటాన్స్ విద్యార్థిని అనన్య



క్రోసూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి క్రోసూరు సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన పోతాబత్తుని అనన్య అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత శుక్రవారం తెలిపారు. ఎంపకపై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినిని అభినందించారు.

కుష్ఠువ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



రాజుపాలెం: కుష్ఠువ్యాధిని గుర్తించాలని డాక్టర్ కృష్ణకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయ న మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అనుమానమైన మచ్చలు ఉంటే పరీక్షలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో బీపీఎంఓ పాపారావు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రత్తి జీవన్ రావు, ఉషారాణి, గంగాధర్, గౌరీ పాల్గొన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ3.86 లక్షలు

రాజుపాలెం: మండలంలో దేవరంపాడు కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలు శుక్రవారం లెక్కించారు. మూడు నెలలకు గాను రూ.3,86,193 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి గుర్రం శ్రీనివాసరావు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సత్తెనపల్లి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, సర్పంచి ప్రత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీత పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారంతో భయం భయం



విప్పర్ల(క్రోసూరు): గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గేదెలు, దూడలు, మూగజీవాలపై వెంటపడి ప్రతాపం చూపుతున్నాయి. రోజులో మూడు, నాలుగు దూడలపై దాడులు చేస్తున్నాయి. శుక్రవారం దాడిలో దూడ మృతి చెందింది. ప్రజల ఆందోళన చెందుతున్నారు.పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కుక్కల పై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జె.ప్రకాశ్‌ను వివరణ కోరగా త్వరలో చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి పోదాం..

పేదలకు వైద్యం చేరువైంది. కార్పొరేట్ తరహా సర్కారీ వైద్యం అందుతోంది. గతంలో పరిస్థితి ఓ సినిమాలో 'నేను రాను బిడ్డో సర్కారీ దవాఖాన'కు అనే గేయాన్ని తలపించేంది. మొన్నమొన్నటి వరకు అదే పరిస్థితి. మందులు లేవు.. టెస్ట్‌ల మాట సరేసరి. పురిటినొప్పులైతే ప్రాణం చేతిలో పెట్టుకుని పట్నం వెళ్లాల్సింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పేదల వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇంటి వద్దకు వైద్యం అందుతుందంటే గ్రామీణుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.



అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్



అత్తలూరులో నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనం

- అత్తలూరు పీహెచ్‌సీ రూ.2కోట్లతో ఆధునీకరణ
- ఉచితంగా 68 రకాల పరీక్షలు, 168 రకాల మందులు
- అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు
- నెలకు ఆరు వేల మందికి వైద్యచికిత్సలు

అమరావతి: మండల జనాభాకు అందుబాటులో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు అత్తలూరు పీహెచ్‌సీ ఉన్నాయి. మండలంలో68వేల మంది జనాభా ఉంది. సీహెచ్‌సీలో ఏడుగురు డాక్టర్లు ఉండాల్సిన ఒకరు లేక ఇద్దరు డాక్టర్లు ప్రజలు వైద్యం చేసేవారు. సిబ్బంది కూడా అంతంతమాత్రంగా ఉండేవారు. 4 ఏళ్లలో నెలకు 7500 నుంచి 9000 మంది రోగులకు వైద్యసేవలు అందించే స్థాయికి పెరిగింది. ప్రతిరోజు 300కుపైగా ఓపీ పేషెంట్లకు, 25 నుంచి 28మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఏడుగురు డాక్టర్‌లతో పాటుగా కాంటాక్టు పద్ధతిలో మరో డాక్టరు ఉన్నారు. అలాగే గతంలో 10 మంది కూడా లేని సిబ్బంది నేడు 31మంది సిబ్బంది ఈ అస్పత్రిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం హెల్త్‌సెంటర్‌ను మూడు కోట్లరూపాయల నిదులతో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 50 పడకల అస్పత్రిగా విస్తరణ పనులు తుదిదశకు చేరాయి.

మండల పరిధిలోని అత్తలూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఒకనాడు తాళ్లూరు సమితిలో సుమారు లక్ష మంది జనాభాకు వైద్యసేవలు అందించింది. అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందించింది. గతంలో ల్యాబ్, డెలివరి రూమ్, ఆపరేషన్ థియేటర్ ఉన్నాయి. నిర్లక్ష్యానికి గురైన ఆస్పత్రిలో నామమాత్రంగా సేవలందించేవారు.

నూతన ఆస్పత్రి భవనం

1960లో నిర్మించిన అత్తలూరు పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవ చూపారు. పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తీసుకెళ్లి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. పనులు తుదిదశకు చేరాయి. నూతన భవనంలో అత్యాధునిక ల్యాబ్, డాక్టర్ రూంలు, ఫార్మసీ గది, ఆపరేషన్ థియేటర్, వార్డులు, సమావేశ హాల్ నిర్మిస్తున్నారు.

నూటికి నూరుశాతం సిబ్బంది..

గతంలో అరకొర సిబ్బందితో పాటుగా రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక ఏఎన్ఎం ఉండేవారు. కాని నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమరావతి మండలాన్ని రెండు క్లస్టర్‌లుగా విభజించారు. క్లస్టర్‌కు ఇద్దరు నిపుణులైన వైద్యులను నియమించారు. క్లస్టర్‌కు నలుగురు చొప్పున పర్యవేక్షాధికారులను నియమించారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు 19 మంది ఏఎన్ఎంలను అలాగే 15వ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేయటానికి బీఎస్సీ నర్సింగ్ చదివిన 15మంది ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నారు. వీరితో పాటుగా మండలంలో అన్ని గ్రామాలలో 55 మంది ఆశ వర్కర్లు పనిచేస్తున్నారు.

అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం

గతంలో రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలంటే 13కిలోమీటర్ల దూరంలో ఉన్న అమరావతికి వెళ్లి ప్రైవేట్ ల్యాబ్‌లలో వందల రూపాయలు చెల్లించి పరీక్షలు చేయించుకునే పరిస్థితి ఉంది. కానీ నేడు అత్తలూరు పీహెచ్‌సీలో సుమారు 10లక్షల రూపాయల అత్యాధునిక రోగనిర్ధారణ పరీక్ష యంత్రాలను అమర్చారు. నెలలో 8,095 మందికి అత్తలూరు పీహెచ్‌సీలో ల్యాబ్‌లో గాని, 104సంచార వైద్యశాలలో ల్యాబ్‌ల ద్వారాగాని రోగనిర్ధారణ పరీక్షలు చేశారు. అందుబాటులో 168రకాల మందులున్నాయి.

నెలలో 11వేలకు పైగా వైద్యచికిత్సలు

అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు గతంలో 500 నుండి 700 వైద్య చికిత్సలు అందించేవారు. నేడు 11వేలకుపైగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిరోజు 70నుంచి వంద మంది రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు.

104 సంచార సేవలు

ప్రభుత్వం దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులకు, మహిళలకు ఆ గ్రామంలోనే వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన 104 సంచార వైద్యసేవలు అందిస్తున్నారు. వాహనంలో వైద్యాధికారి, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంతో మొత్తం నలుగురు వైద్యసేవలు అందిస్తారు. 21 గ్రామాలకు సేవలందిస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్..

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ రోగులకు, వృద్ధుల పాలిట వరంలా మారింది. నెలకు రెండు సార్లు గర్భిణిలు, బాలింతలు, మంచంలో నుంచి లేవలేని రోగులకు నెలకు రెండు సార్లు సేవలందించనున్నారు. ఇప్పటికి మండలంలో ఉన్న 19 గ్రామాలలో నెలకు మంచంలోనుండి లేవలేని వారికి 95 మందికి సేవలు అందించారు. సుమారు 5వేల మంది దీర్ఘకాలిక వ్యాధుల వారికి చికిత్స అందించారు.

ఇప్పుడు ఇద్దరు డాక్టర్లు ఉంటున్నారు..



గతంలో రోజుకు పది, పదిహేను మంది కంటే ఎక్కువ మంది రోగులు మాఊరు అస్పత్రికి వచ్చేవారు కాదు. అలాగే డాక్టర్లు కూడా ఉప్పుడో వచ్చి వెళ్లిపోయేవారు. కాని ఇప్పుడు ఇద్దరు డాక్టర్లు ఉంటున్నారు. మాఊరి నుండే కాకుండా చుట్టపక్కల ఊళ్ల నుంచి కూడా రోగులు బాగానే వస్తున్నారు. ఇన్ని పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారంటే నమ్మలేక పోతున్నాం. పేదోళ్ల ఆరోగ్యం కోసం జగనన్న కృషి అభినందనీయం.

– సింగమనేని నాగలక్ష్మి, మాజీ సర్పంచి, అత్తలూరు

ఇంటికి వచ్చి వైద్యం..



నెలకు రెండు సార్లు 104వాహనం మా ఊరు వచ్చింది. అన్నిరకాల పరీక్షలు ఉచితం గానే చేస్తున్నారు. అవసరమైతే ఇంటికి వచ్చి మరి వైద్యం చేస్తున్నారు. గతంలో ఒకపూట మాత్రమే ఉండేది, కాని ఇప్పుడు ఉదయం నుంచి సాయంత్రం వరకు మాఊళ్లోనే ఉంటుంది. సరిపడా మందులు ఇస్తున్నారు. పేదోళ్ల ఆరోగ్యంపై ప్రభుత్వం బాగా శ్రద్ధ చూపుతోంది.

– పేరుపోగు నాగేశ్వరరావు, మండెపూడి

పూర్తి స్థాయి సేవలు



పూర్తి స్థాయిలో సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నాం . ప్రభుత్వం కూడా మందులు, టీకాలు అన్ని సకాలంలో మంజూరు చేస్తుంది.

– డాక్టర్ ఎస్.మౌనిక, వైద్యాధికారి, అత్తలూరు

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి: అర్హులై ఉండి చిన్నచిన్న లోపాలు, సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి, సకాలంలో ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు పొందలేని వారికి, అన్ని రకాల ప్రజా వినతుల, సామాన్యుల సమస్యల పరిష్కారానికే ' జగనన్న సురక్ష ' కార్యక్రమం అని రాష్ట జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో జగనన్న సురక్షపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, సమష్టిగా ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను గుర్తిస్తారని చెప్పారు. నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలని వివరించారు. దీనిలో భాగంగా మండల స్థాయిలో ప్రతిరోజూ ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు. క్యాంపుల్లో భాగంగా కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, బియ్యం కార్డు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యుటేషన్లు, ఫోన్ నంబర్ ఆధార్ లింకేజీ తదితర 11 రకాల సర్టిఫికెట్లను జారీ చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. నిత్యం ఏదో ఒక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ప్రజల మధ్యలో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక అమలు చేస్తున్నారని, తద్వారా ప్రజల మనసులను గెలుచుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు మనం చేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమమని వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, సీనియర్ న్యాయవాది పక్కాల సూరిబాబు, పల్నాడు జిల్లా వైద్యుల విభాగం కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి తదితరులు మాట్లాడారు. సదస్సులో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, శివరామిరెడ్డి, మండల కన్వీనర్లు భవనం రాఘవరెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్, నక్క శ్రీనివాసరావు, సహారా మౌలాలి, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు కొణతం స్వాతి(సత్తెనపల్లి టౌన్), బొంతు వెంకటరెడ్డి(సత్తెనపల్లి రూరల్), రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి (ముప్పాళ్ల), మేడం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(నకరికల్లు), పులిబండ్ల అశోక్ (రాజుపాలెం), మర్రి సుబ్బారెడ్డి, డాక్టర్ మక్కెన అచ్చయ్య , ఎంజేఆర్ లింగారెడ్డి పాల్గొన్నారు.

ఫణిదం పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ ధ్రువీకరణ పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఫణిదం పీహెచ్‌సీ వైద్యులు ప్రదీప్, శ్రీలక్ష్మీ కవిత తదితరులు

సత్తెనపల్లి: కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ద్వారా ప్రతిష్ఠాత్మకమైన జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సూచీ ధ్రువీకరణ పురస్కారానికి (ఎన్‌క్వాస్) సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ లోతేటి శివశంకర్ నుంచి వైద్యులు వేమవరపు ప్రదీప్, యు.శ్రీలక్ష్మీ కవిత పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమష్టి కృషికి ఇది నిదర్శనమని అభినందించారు. వైద్యులు మాట్లాడుతూ ఈ ప్రశంసాపత్రం రావడానికి పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జి.శోభారాణి సూచనలు, తోడ్పాటు అందించడం వల్లనే సాధ్య మైందన్నారు. కార్యక్రమంలో ఫణిదం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పెండెం మణిరావు, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ప్రసాద్

నకరికల్లు: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ప్రసాద్ శ్రీరామినేని అన్నారు. మండలంలోని నర్సింగపాడులో బాలకార్మిక వ్యవస్థ నిరోధక చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 14ఏళ్ల లోపు బాలలను పనిలో పెట్టకూడదన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడికి పంపాలన్నారు. ప్రభుత్వం అన్నిరకాల వసతులు, మధ్యాహ్న భోజనం , యూనిఫాం అందజేస్తోందని చెప్పారు. చట్టానికి ప్రతిఒక్కరూ సమానమేనని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షేక్ అబ్దుల్ అలీం, మహిళా పోలీస్ ఏ త్రివేణి, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అచ్చంపేట: వర్షాకాలం దృష్ట్యా సీజనల్‌గా వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఏఎన్ఎంలపై ఉందని వైద్యాధికారి శ్యామల తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సహజంగా వ్యాధులు నీటి ద్వారానే వ్యాప్తి చెందుతాయన్నారు. ముఖ్యంగా వర్షంనీరు పైపులైన్లలోకి వెళ్లడం, ఆ నీటిని క్లోరినేషన్ చేయకుండా గ్రామస్తులకు సరఫరా చేయడం వంటి చర్యల వలన వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. మండలంలోని పుట్టిగూడెంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి డాక్టర్ రాజేష్, సీహెచ్ఓ శివనాగేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, పీహెచ్ఎన్ జాన్స్, హెచ్‌వీ ఎలిజిబెట్, బేజీరాని, ఎంపీహెచ్ఎస్ రాధాకృష్ణ, భాగవదాసు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

నకరికల్లు: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను మాత్రమే రైతులకు విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు ఆదేశించారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో శుక్రవారం నకరికల్లులో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధీకృత డిస్ట్రిబ్యూటర్ వద్ద నుంచి మాత్రమే విత్తనాలు, పురుగుందులు, ఎరువులను కొనాలని డీలర్లకు సూచించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చే బిల్లులపై కొనుగోలుదారుని, అమ్మకందారుని సంతకాలు, పంట రకం, లాట్ నంబర్ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు పాల్గొన్నారు.


వ్యవసాయ సహాయకులతో సమీక్ష..

మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల అమలు గురించి వ్యవసాయ సహాయకులతో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు సమీక్ష చేశారు. కిసాన్ ఈ–కేవైసీ పూర్తి చేయాలని, మట్టి నమూనాలు సేకరించి రైతులకు భూసార పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పంటసాగు హక్కు పత్రాలను గ్రామ రెవెన్యూ ద్వారా రైతులకు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు పాల్గొన్నారు.

గడప వద్దకే ప్రభుత్వ సేవలు

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేలా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు గాను ప్రతి గడప వద్దకు వలంటీర్లు వెళ్లి వివరాలు సేకరించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలోను ప్రభుత్వ సేవలకు సంబంధించి చిన్న సమస్యను కూడా ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే చేపట్టారన్నారు. ఎవరైనా అర్హులై ఉండి ధ్రువీకరణ పత్రాలు లేకుంటే వారిని గుర్తించి వారికి ధ్రువపత్రాలు అందించటం జరుగుతుందన్నారు. మొత్తం 11 రకాల సర్టిఫికెట్‌లు ఎటువంటి రుసుము లేకుండా పత్రాలు అందించటం జరుగుతుందన్నారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు ప్రతి గడపను సందర్శించి అలాంటి వారి వివరాలు సేకరించాలన్నారు. జూలై 1వ తేదీన జరిగే క్యాంపులలో సర్టిఫికెట్‌లు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు.

అదునుకు వర్షం– రైతుల్లో హర్షం



వానకు తడసిన పత్తి చేనులో అరక తోలుతున్న రైతు

అమరావతి: తొలకరి చినుకు పలకరించింది. రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తి చేసుకున్న రైతులు విత్తేందుకు సిద్ధంగా ఉన్నాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతు పులకించాడు. పొలాలు సిద్ధం చేసుకుని పత్తి విత్తనాలు నాటుకుంటున్నాడు. మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో మిర్చి నారు మడులు వేయటానికి అనుకూలంగా వాతావరణం ఉండటంతో నారుమడులు సిద్ధం చేస్తున్నారు. సాగునీటి వసతి లేని మెట్ట పొలాలలో సాగు చేసే వర్షాధార పంటలకు సాగు చేయటానికి అదునులో వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 9,200 హెక్టార్లలో పత్తి, 3,000 హెక్టార్లలో మిర్చి. ఇతర పంటలు 500 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉందని అధికారుల అంచనా వేశారు.

నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలి



చౌటపాపాయపాలెంలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజుపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో జగన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వేను ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అవసమైన సర్టిఫికెట్లను ఒక్కరోజులోనే అందిస్తామని తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాంనగర్‌లోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహించే మెగా జాబ్‌మేళా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఔత్సాహిక నిరుద్యోగ యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు ఏ రమ్య(83285 44388), మహిధర్(99669 85773), ఫిరోజ్ గాంధీ (70139 50097), ఖాదర్ బాషా(94409 88148) లను సంప్రదించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే శంకరరావు పర్యటన

అమరావతి: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మండలంలో శనివారం నిర్వహించున్న పలు కార్యక్రమాలలో పాల్గొంటారని ఎంపీడీఓ మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఎనికెపాడు గ్రామంలో అంతర్గత, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని, నెమలికల్లులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

పీహెచ్‌సీ వైద్యురాలు ప్రవీణదీప్తి బదిలీ

క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రవీణ దీప్తి శుక్రవారం బదిలీ అయ్యారు. ఇక్కడ నుంచి పెదకాకాని పీహెచ్‌సీకి వెళ్లారు. పీహెచ్‌సీ వైద్యురాలిగా సుమారు 5 సంవత్సరాలు పనిచేశారు.

వైద్యశాలలో సమస్యల పరిష్కారానికి వినతి

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ కోరారు. శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలసి వినతి పత్రం అందించాడు. వైద్యశాలలో నేత్ర వైద్య సేవలకు సంబంధించిన పరికరాలకు సుమారు రూ.5 లక్షలు అవసరం కాగా వాటిని సీఎస్ఆర్ఎం ఫండ్స్ కింద కొనుగోలు చేయాలని డీసీహెచ్‌ను ఆదేశించారని చెప్పారు. అలాగే వైద్యశాల వంద పడకలు అయినప్పటికీ శానిటరీ, సెక్యూరిటీ విభాగాలు 50 పడకల వైద్యశాలకు ఉన్న సౌకర్యాలు మాత్రమే ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా జీఓ ప్రకారం మరో వారం రోజుల్లో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు.

వితంతువులను గౌరవించాలి

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మిరియమ్మ పాల్గొని సమాజంలో వితంతువులపై వివక్షత విడనాడాలని, అందరూ సమానమే అని భావించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలను నిర్మూలిద్దాం.. వితంతువులను గౌరవిద్దాం అనే నినాదాలతో కూడిన పకార్డులతో గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.